క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

నాగాయలంక: ప్రపంచ ఓజోన్ దినోత్సవం, వినాయక చవితిని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ పర్యావరణ క్లబ్, నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు మట్టి గణపతి ప్రతిమలను తయారు చేశారు. ఎన్‌జీసీ కృష్ణా జిల్లా సమన్వయకర్త కొమ్మినేని ఉదయకుమార్ మాట్లాడుతూ పండుగలు, సంప్రదాయాలు, పర్యావరణ రక్షణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఓజోన్ దినోత్సవం చిహ్నంగా విద్యార్థులు ఓ3 ఆకారం ప్రదర్శించారు. హెచ్‌ఎం వనమా రామకృష్ణ, పీడీ గాజుల లక్ష్మీప్రసాద్, పద్యాల రఘురామయ్య పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలి

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి హెప్సిబారాణి అన్నారు. ఉత్తర చిరువోలులంక గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అవసరం ఉన్నంత వరకే రసాయనిక, పురుగుమందులు వాడాలన్నారు. అవసరానికి మించి ఎరువులు, పురుగు మందులు వాడితే జరిగే నష్టాలను రైతులకు వివరించారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ రెడ్రౌతు వెంకట రమణ, అల్లూరి సీతారామరాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.

నేడు కె. కొత్తపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

కె. కొత్తపాలెం(మోపిదేవి): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కె. కొత్తపాలెంలో ఆదివారం ఉదయం ఏడు గంటలకు నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు లింగం జగదీష్ కుమార్ తెలిపారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి స్థానికుల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. అన్ని శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

మట్టి ప్రతిమల వినియోగంపై అవగాహన

మచిలీపట్నంటౌన్: పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరు మట్టి గణనాథుని ప్రతిమలనే పూజించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కాలుష్య నివారణ మండలి విజయవాడ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గుడివాడ సమీపంలోని బిళ్లపాడుకు చెందిన కళాకారులు పాటలు, నాటికల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు వినాయక చవితి రోజున మట్టి గణనాథుని ప్రతిమలకు పూజలు నిర్వహించాలని, దీని వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

నగర పాలక సంస్థ ఇంజినీర్లకు ఉద్యోగోన్నతి

మచిలీపట్నంటౌన్: నగర పాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న పలువురు ఇంజినీర్లకు ఉద్యోగోన్నతులు కల్పిస్తూ పబ్లిక్ హెల్త్ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఆదేశాలు జారీ చేశారు. నగర పాలక సంస్థలో డీఈఈగా పనిచేస్తున్న వెంకట రమణకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పదోన్నతి లభించింది. ఆయనను ఏలూరు నగర పాలక సంస్థకు బదిలీ చేశారు. ఏఈలుగా పనిచేస్తున్న ఆర్‌జీ వరప్రసాద్, కె. సతీష్‌చంద్రలకు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిద్దరినీ మచిలీపట్నం నగర పాలక సంస్థలోనే పనిచేసేలా ఆదేశాలు ఇచ్చారు. పదోన్నతి పొందిన ఇంజినీరింగ్ అధికారులకు పలువురు అభినందనలు తెలిపారు.

రేపు మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

అవనిగడ్డ: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని చైల్డ్‌హుడ్ గ్రూపు ఆధ్వర్యంలో సోమవారం మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తామని గ్రూపు అధ్యక్షుడు మత్తి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టు సెంటర్‌లోని చైల్డ్‌హుడ్ గ్రూపు కార్యాలయం వద్ద గణపతి విగ్రహాలను ఉచితంగా అందిస్తామన్నారు.

కృష్ణా వర్సిటీలో ఓజోన్ పొరపై వర్క్‌షాప్

కోనేరుసెంటర్: ప్రపంచ ఓజోన్ పొర దినోత్సవాన్ని పురస్కరించుకుని రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం కృష్ణా విశ్వవిద్యాలయంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఓజోన్ పొరను రక్షించుకునేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను ట్వింకిల్ సాయి, రోష్ణ సత్య, బాలాజీలు నాటిక రూపంలో ప్రదర్శన ఇచ్చారు. మొక్కల పెంపకం ద్వారా నే ఓజోన్ పొరను కాపాడుకోగలమనే సందేశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చాటిచెప్పారు. రసాయన శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ రామశేఖర్‌రెడ్డి సమన్వయకర్తగా వ్యవరించిన కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు అనిల్ కుమార్, రవి, పుష్పలత, రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరు: మండల పరిధి ముక్కోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జి. శ్రీహరి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల స్థానంలో మట్టి వినాయకుని ప్రతిమలను నిమజ్జనం చేయడం ద్వారా నీటి కాలుష్యాన్ని అరికట్టవచ్చునని తెలిపారు. పాఠశాల విద్యార్థులతో మట్టితో విగ్రహాలను తయారు చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. చిన్నారులు గీసిన చిత్రాలు ఆకట్టుకున్నాయి.

మంచి జరిగిందనిపిస్తే జగన్‌తో నడవండి

- జగన్‌పై పవన్, చంద్రబాబు కుట్రలు
- వారి ఆటలను కట్టించాల్సింది మీరే
- మంత్రి జోగి రమేష్
- పెడన నియోజకవర్గంలో కాపు నేస్తం చెక్కుల పంపిణీ



పెడనలో కాపు నేస్తం లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

పెడన: మంచి జరిగిందనిపిస్తే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే మీరంతా నడవాలని, ఆయనను వెన్నంటే ఉండాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. శనివారం పెడన నియోజకవర్గంలోని కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన, గూడూరు మండలాల్లో కాపు నేస్తం పథకం నమూనా చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో మంత్రి జోగి రమేష్ మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేద కుటుంబానికి మంచి చేస్తున్నారని చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతోందన్నారు. మీకు మంచి జరుగుతున్నప్పుడు మీరంతా ఆయన వెన్నంటే ఉండి ఆశీర్వదించినప్పుడే మనం ఆయన రుణం తీర్చుకున్న వారమవుతామని తెలిపారు. ఆయన సీఎంగా మళ్లీ మళ్లీ ఉన్నప్పుడు మనకు మరిన్ని పథకాలు లభిస్తాయని చెప్పారు. ప్రజలకు ఇంత మంచి చేస్తున్న సీఎం జగన్‌పై పవన్, చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని, కల్లబొల్లి మాటలు చెబుతూ మీ వద్దకు వస్తున్నారని, అటువంటి వారికి మీరే గుణపాఠం చెప్పాలన్నారు. చంద్రబాబు కోట్లాది రూపాయలు హవాలా రూపంలో మింగేస్తే కోర్టు శిక్ష వేస్తే జైలుకు వెళ్లారన్నారు. పెడన నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్ కాపు నేస్తం పథకం కింద 4,489 మంది లబ్ధిదారులకు రు.6.73 కోట్ల నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో జమ అవుతున్నాయని మంత్రి తెలిపారు.

కృత్తివెన్ను మండలం గుడిదిబ్బ నాగేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరిగిన కార్యక్రమంలో 1,143 మంది కాపు అక్క చెల్లెమ్మలకు రూ.1,71,45,000, బంటుమిల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో బంటుమిల్లి మండలంలోని 878 మంది లబ్ధిదారులకు రూ.1,31,70,000, పెడన మార్కెట్ యార్డ్ అవరణలో జరిగిన కార్యక్రమంలో పెడన పట్టణ పరిధిలో 175 మందికి రూ.26.25 లక్షలు, పెడన రూరల్‌లో 874 మందికి రూ.1,13,10,000, గూడూరు జాతీయ రహదారి సమీపంలోని సుమా కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో గూడూరు మండలంలోని 1,543 మంది కాపు అక్క చెల్లెమ్మలకు రూ.2,31,45,000 లకు సంబంధించి నమూనా చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజులపాటి వాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గరికపాటి చారుమతి, వైఎస్సార్ సీపీ నాయకులు కొండవీటి నాగబాబు, బండారు మల్లి, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, జ్యోతి, కౌన్సిలర్లు, గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, బంటుమిల్లి ఎంపీపీ వెలివెల చినబాబు, ఏఎంసీ చైర్మన్ కె. గంగాధర్, మండల కన్వీనర్ ఎస్. మహేష్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి..

కృత్తివెన్ను: ప్రతి పేద కుటుంబంలో సంతోషం నింపాలనే తపనతో పాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. శనివారం వైఎస్సార్ కాపు నేస్తం నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం కృత్తివెన్ను శివాలయం వద్ద నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ పాల్గొని 1,173 మంది కాపు మహిళలకు కాపు నేస్తంకు సంబంధించి రూ. 1.71 కోట్ల 45 వేల నమూనా చెక్కును అందజేసి మాట్లాడారు.


చెక్కు అందజేసి గూడూరు సభలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

తనకు ఓటు వేసిన వారికే కాకుండా ఓటు వేయని వారికి సైతం కులమత, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అని అన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఏనాడైనా పేదల గురించి ఆలోచించాడా అని ప్రశ్నించారు. అవినీతికి పాల్పడ్డాడు కాబట్టే చంద్రబాబు జైలుకు పోయాడన్నారు. అవినీతిని ప్రశ్నించకుండా పవన్ కల్యాణ్ అవినీతికి సపోర్టు చేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. చంద్రబాబు ఆయన కుమారుడు లోకేష్ కరోనా సమయంలో హైదరాబాద్ పారిపోయారని, వీళ్లు ఉండేదేమో హైదరాబాద్‌లో.. రాజకీయ పదవులు మాత్రం ఆంధ్రాలో కావాలా అంటూ ప్రశ్నించారు. అనంతరం ఆయన స్థానిక శివాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, మండల కన్వీనర్ వెంకట్రాజు, కాపు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల డైరెక్టర్లు పి. మహేష్, జె. భూపతిరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ బాపూజీ, ఎంపీటీసీ విజయకుమారి, ఎంపీడీఓ పిచ్చిబాబు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



పులిగడ్డ(అవనిగడ్డ): స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని పులిగడ్డ చెక్‌పోస్ట్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మోపిదేవి మండలం కె. కొత్తపాలెంకు చెందిన అఖిల్ మరొకరితో కలిసి పులిగడ్డ వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అఖిల్‌ను తొలుత స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు, అనంతరం మెరుగైన వైద్యం కోసం మచిలీపట్నం ఆస్పత్రికి తరలించారు.ఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేశారు.

హోరాహోరీగా బాలికల ఆటల పోటీలు

మోపిదేవి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో మండల స్థాయి బాలికల ఆటల పోటీలు రెండో రోజు హోరాహోరీగా జరిగాయి. స్థానిక ఆశ్రమ పాఠశాల అవరణలో శనివారం బాలికల అండర్-14, అండర్-17 విభాగాల్లో ఆటల పోటీలు ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌పై పోటీలు నిర్వహించారు. విజేతలుగా ఎంపికైన జట్లను నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపనున్నామని ఎంఈఓ విద్యాసాగర్ తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపాలన్నారు. మండల స్పోర్ట్స్ కన్వీనర్ అప్పికట్ల శ్రీ హరి, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు గాబ్రియేలు, రామకృష్ణ, తాతాజీరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎవరెన్ని పొత్తులతో వచ్చినా విజయం మాదే

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- మంగళాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం

మంగళాపురం(చల్లపల్లి): ఎవరు ఎన్ని పొత్తులతో వచ్చినా రానున్న ఎన్నికల్లో విజయం మాదేనని, కాబోయే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. శనివారం మంగళాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు, ఆయన తనయుడు సింహాద్రి వికాస్‌బాబు గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో పర్యటించి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు విద్య, వైద్యం అత్యున్నత ప్రమాణాలతో అందిస్తున్నారని చెప్పారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామీణ, పట్టణ ప్రాంత పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కనీవినీ ఎరుగని అధునాతన సౌకర్యాలు కల్పించారన్నారు. సీఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని వివరించారు. సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో పేదరికం తగ్గిందని, ఇది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన దక్షతకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్‌షాద్ నజరానా, సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్లు పేరం నాగిరెడ్డి, పాగోలు నాగ సీతారామారావు (ఫణి), శీరం వెంకట సత్యనారాయణ (నాని), ఏఎంసీ డైరెక్టర్ మోతుకూరి కొండలు, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు బొందలపాటి లక్ష్మి, సీనియర్ నాయకులు తుమ్మల వెంకటేశ్వరరావు, పరుచూరి వెంకన్నబాబు, అధికారులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



మచిలీపట్నంటౌన్: 28వ డివిజన్‌కు చెందిన గంజాల తులసీరామ్ లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకున్నారు. శస్త్రచికిత్స చేయించుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సాయం ఇప్పించాలంటూ తులసీరామ్ ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)ని కోరారు. స్పందించిన ఆయన తులసీరామ్‌కు సాయం అందించాలని ముఖ్యమంత్రికి సిఫార్సు చేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 50 వేల చెక్కును వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శనివారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి షేక్ మొహమ్మద్ సాహెబ్, సచివాలయ కన్వీనర్ రమేష్, గృహ సారథి, పిచ్చుక శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు

చల్లపల్లి: ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు రెండో రోజుకు చేరాయి. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కొక్కిలిగడ్డ నవీన్ ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలతో పర్యావరణ రక్షణ

పెడన: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అన్నారు. శనివారం తోటమూల జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సీహెచ్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టి వినాయకుని ప్రతిమలను తయారు చేశారు. నో బ్యాగ్ డే సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించామని హెచ్‌ఎం తెలిపారు. చేవేంద్ర జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం రవికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టి వినాయకుని ప్రతిమలు తయారు చేశారు. ఈ సందర్భంగా పర్యావరణ హిత మట్టి వినాయకుని ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కాలుష్యానికి కారణమయ్యే రసాయనాల వినియోగం, ప్రజలు పడుతున్న ఇబ్బందులను విద్యార్థులకు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


చేవేంద్ర జెడ్పీహెచ్‌ఎస్ తయారు చేసిన మట్టి ప్రతిమలతో విద్యార్థులు

విద్యార్థుల పూజలు..

మచిలీపట్నంటౌన్: నగరంలోని జవ్వారుపేట శ్రీ వేంకటేశ్వర ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో విద్యార్థులు శనివారం మట్టి, పసుపుతో తయారు చేసిన గణనాథుని విగ్రహాలకు పూజలు నిర్వహించారు. పాఠశాలలో విగ్రహాలు తయారు చేసి ముందస్తుగా వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఎం. సత్యనారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో నిర్మాణాల పరిశీలన

కోనేరుసెంటర్: బందరు మండలం మేకవానిపాలెంలోని జగనన్న కాలనీని డ్వామా పీడీ, హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ జీవీ సూర్యనారాయణ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో పర్యటించి గృహ నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి గృహ నిర్మాణాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. బిల్లుల మంజూరు విషయంలో ఇబ్బందులు ఉంటే తెలియజేయాలన్నారు. కాలనీ ముఖద్వారం వద్ద ఆర్చ్ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కాలనీకి అవసరమైన డ్రెయినేజీ వసతిపై సంబంధిత సిబ్బందితో మాట్లాడారు. తాగునీటి సరఫరా విషయంలో పైపులైన్ నిర్మాణ పనులకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించారు. కాలనీకి అవసరమైన వసతుల కల్పనలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ బుజ్జిబాబు, ఏఈ రవితేజ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు, పంచాయతీరాజ్ యూ జవహర్, మేకవానిపాలెం మాజీ సర్పంచ్ మేక శ్రీనివాసరావు, మేకవానిపాలెం పంచాయతీ కార్యదర్శి గరికపాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందితో చర్చిస్తున్న హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ సూర్యనారాయణ

అర్హులందరికీ పెన్షన్ల పంపిణీ

కోనేరుసెంటర్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పెన్షన్లను అందజేస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. మండల పరిధిలోని కరగ్రహారం, మేకవానిపాలెం, గోపువానిపాలెం, తపసిపూడి, మంగినపూడి, సిరివెళ్లపాలెం, గోకవరం, తాళ్లపాలెం, కానూరు, పెదపట్నం గ్రామాల్లో సుమారు 559 మంది లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పెన్షన్లను శనివారం కిట్టు చేతుల మీదుగా అందజేశారు. కిట్టు మాట్లాడుతూ మండలంలో వందలాది మందికి పెన్షన్లు అందజేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అలాగే అర్హులైన వారందరికీ పెన్షన్లు మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే పేర్ని నాని విశేష కృషి చేశారని చెప్పారు. అర్హత ఉండీ ప్రభుత్వ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే నేరుగా తమను సంప్రదించాలన్నారు. బందరు ఎంపీడీఓ బాలకృష్ణారావు, నాయకులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు పెన్షన్ అందజేస్తున్న పేర్ని కిట్టు తదితరులు

ట్రాఫిక్ సమస్యలపై ఎస్పీకి ఫిర్యాదు

పెడన: పట్టణంలో ఉదయం పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే సమయంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని 9వ వార్డు కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు శనివారం జిల్లా ఎస్పీ జాషువాను కలిసి ఫిర్యాదు చేశారు. ఉదయం 9 నుంచి పది గంటల సమయంలో, అలాగే సాయంత్రం 4 నుంచి 6 గంటల సమయంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని, సమస్యను పరిష్కరించాలని కోరారు.

ట్యాబ్‌ల వినియోగంపై శిక్షణ

చల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందించిన ట్యాబ్స్ వినియోగంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారంపై హెచ్‌ఎంలు, నోడల్ ఉపాధ్యాయులు సరైన అవగాహన కలిగి ఉండాలని జిల్లా నోడల్ అధికారి మహమ్మద్ దావూద్ అన్నారు. శనివారం స్థానిక మండల విద్యా శాఖ కార్యాలయంలో చల్లపల్లి, మోపిదేవి మండలాల స్థాయి శిక్షణ సమావేశం నిర్వహించారు. ట్యాబ్ పగిలిపోతే గ్రామ సచివాలయంలో ఫిర్యాదు చేసి ఎక్నాలడ్జిమెంట్ పొందాలని సూచించారు. ట్యాబ్ అపహరణకు గురైతే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఎఫ్‌ఐఆర్ కాపీని అధికారులకు పంపాలని చెప్పారు. బార్ కోడ్ స్కానింగ్ సమస్యలపై మండల ఎంఐఎస్ కో-ఆర్డినేటరు ద్వారా జిల్లా అధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు జీఎస్‌బీ గోపాల్, మోపిదేవి ఎంఈఓ సాగర్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేద్దాం

పెడన మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి

పెడన: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. వలంటీర్లు, గృహ సారథులు కలిసి వైద్య సిబ్బందికి సహకరించి ఇంటింటి సర్వేలో భాగస్వాములు కావాలని చెప్పారు. పట్టణంలోని 5, 6, 7, 8, 9 వార్డు సచివాలయాల పరిధిలోని వలంటీర్లు, గృహ సారథులకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై మున్సిపల్ కార్యాలయం సమావేశపుహాల్‌లో శనివారం అవగాహన కల్పించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ సూచనల మేరకు ఇంటింటి సర్వే చేసి ఆ నివేదికలను అధికారులకు అందజేయాల్సి ఉంటుందన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఏసుబాబు, కౌన్సిలర్లు పిచ్చిక సతీష్‌బాబు, మెట్ల గోపీప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మల్లి, పట్టణ సచివాలయాల కన్వీనర్ మతీన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి

అంధత్వ నిర్మూలనకు లయన్స్ క్లబ్ కృషి

చల్లపల్లి: ప్రపంచ దేశాల్లో అంధత్వ నిర్మూలనకు లయన్స్ క్లబ్ కృషి చేస్తోందని లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్‌కే నగర్ అధ్యక్షుడు మోపిదేవి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక కోమలా నగర్‌లోని క్లబ్ కార్యాలయంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వెంకట్రావ్ 55 మందికి కంటి పరీక్షలు చేసి 12 మందిని కంటి శుక్లాల ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు మోపిదేవి వెంకటేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు కస్తూరి ప్రసాద్ ఆర్థిక సహాయంతో ఈ శిబిరం నిర్వహించారు.

పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలి

పెడన: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బలవర్ధకమైన ఆహారం సక్రమంగా అందించేలా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, రెండో వార్డు కౌన్సిలర్ బళ్ల జ్యోత్స్నరాణి అన్నారు. వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ మహా కార్యక్రమాన్ని పురస్కరించుని మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జ్యోత్స్నరాణి మాట్లాడుతూ పోషకాలు కలిగిన ఆహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. బంటుమిల్లి సూపర్‌వైజర్ శ్రావణ కుమారి, అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్‌ఎం పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు మచిలీపట్నం సర్కిల్‌పేట, డోర్‌నెం. 28/403 కాపురస్తురాలు జిడ్డు హరిహరన్ గారి భార్య ప్రశాంతి ఆర్ గారి సంజాయిషీ ప్రకారము యావన్మందికీ తెలియజేయునది ఏమనగా...

నా క్లయింటు మచిలీపట్నం సర్కిల్‌పేట, పసుమర్తి వారి వీధి, డోర్‌నెం. 28/404/1 కాపురస్తులు బోడవరపు (లేటు) వెంకట సుబ్బారావు గారి కుమారుడు సుందరశివరావు గారి వద్ద నుండి యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని కొనుగోలు చేయునిమిత్తమై ఎగ్రిమెంటు పొందియున్నారు. సదరాస్తి బోడవరపు సుందరశివరావు గారి తండ్రిగారైన వెంకట సుబ్బారావు గారు తను స్వార్జితపు సొమ్ముతో ది. 01-10-1973న క్రయ ద.నెం. 2878/1973గా సంక్రమించి వారి స్వాధీన హక్కు భుక్తములలో గల ఆస్తుల గురించి ఎట్టి వ్రాతపూర్వకమైన ఏర్పాట్లు చేయకుండా 1977 సం॥లో మరణించినారు. వారి మరణానంతరము వారి వారసులైన బోడవరపు (లేటు) వెంకట సుబ్బారావు గారి భార్య సీతామహాలక్ష్మి వీరి కుమార్తు సుందర శివరావు మరియు వెంకట సత్యనారాయణమూర్తి గార్లు కలసి ది. 14-11-2002న వ్రాసికున్న పాలీఖత్తు ద. నెం. 3778/2002 రు గా పంచుకున్న ఆస్తిలో బి-షెడ్యూలు దాఖలా సుందర శివరావు గార్కి సంక్రమించిన చ॥గ॥ 333లలో యితరులకు విక్రయించగా మిగిలిన చ॥గ॥ 160.58 లకు సదరు బోడవరపు సుందర శివరావు గారి తండ్రి గారైన వెంకటసుబ్బారావు గారి డెత్ సర్టిఫికెట్ గానీ ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ గానీ లేనందున నా క్లయింటుకు యిచ్చియుండలేదు. కావున అట్టి యీ దిగువ షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన వారసత్వపు హక్కులు గానీ, ఇతరత్రా ఏవిధమైన అభ్యంతరాలు గానీ వున్నయెడల 10 రోజులలోపు వ్రాతపూర్వకంగా తెలుపగలరు. తదుపరి వచ్చు అభ్యంతరాలు పరిగణలోకి తీసుకొనబడవు.

షెడ్యూలు: కృష్ణాజిల్లా, మచిలీపట్నం స॥రి॥ వారి యిలాకా మచిలీపట్నం టౌన్, సర్కిల్‌పేట, మున్సిపల్ వార్డు నెం. 28, డోర్ నెం. 28/404దకు చెందిన దాబా యిల్లు, రేకులషెడ్డుకు హద్దులు: తూర్పు: కొండిపర్తి వెంకటమల్లిఖార్జునరావు గారి స్థలం, ప్రహరీగోడ, దక్షిణం: జిడ్డు భాస్కర ప్రసాద్ గారి ఇల్లు, స్థలము, పడమర: మున్సిపల్ రోడ్డు, ఉత్తరం: బోడవరపు వెంకటసుబ్బారావు గారి ఆస్తికి గల జాయింటు బిల్డింగ్ గోడ. ఈ హద్దుల మధ్య చ॥గ॥ 160.58లు స్థలము మరియు మద్రాస్ టెర్రస్ దాబా రేకుల షెడ్డు వగైరాలతో సహా.

మచిలీపట్నం
ది. 16-9-23

పసుమర్తి సూర్యప్రకాష్
అడ్వకేట్, ఫోన్ : 98661 27503





చవితికి సిద్ధం

వినాయక చవితికి గణనాథుని విగ్రహాలు సిద్ధమయ్యాయి. వలందపాలెంలోని విగ్రహాల తయారీ దుకాణాల వద్ద ఒక్కో విగ్రహం రూ. 100 నుంచి రూ. 50 వేల వరకు ధర పలుకుతోంది. నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులు కొనుగోలు చేసి విగ్రహాలను తీసుకువెళుతున్నారు. ఆదివారం రాత్రికి ఈ విగ్రహాలు ఆయా పందిళ్లకు చేరుకుని సోమవారం ఉదయం నుంచి పూజలు అందుకోనున్నాయి. వివిధ ఆకృతుల్లో, రంగురంగుల వినాయక ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి.

– మచిలీపట్నంటౌన్